క్లుప్తంగా

సీఎం సోదరుడిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



జనగామ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డితో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

విరాళం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

బచ్చన్నపేట: తమ్మడపల్లి గ్రామంలో కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప-కామరాతిల కల్యాణానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ రూ.30వేల విరాళాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు కల్యాణ ఆహ్వాన పత్రికను నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాజు, సానిక రాజు, మేకల మల్లేశం, మహేష్, బాల్‌రాజు పాల్గొన్నారు.

పీరీల పండుగ కోసం..

చిల్పూరు: శ్రీపతిపల్లి గ్రామంలో పీరీల పండుగ, ఆసరాఖానా భవన నిర్మాణం కోసం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రంగు హరీశ్ శనివారం రూ.5 వేల విరాళం మహ్మద్ హిమామ్‌కు అందజేశారు. కార్యక్రమంలో దిండిగాల రాజయ్య, బాషబోయిన రాజు, గుర్రపు రాజు, కిషన్, రొయ్యల రాజు, చంద్రలింగం పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన మారపల్లి మధుకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న 1997–98 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు.. స్నేహితుడి చిన్న కుమార్తె వర్షిత లక్ష్మి పేరున రూ.30 వేలను సుకన్య సమృద్ధి యోజన స్కీం కింద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి శనివారం బాండ్ అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు ఎదులాపురం మదన్‌మోహన్, ఇల్లందుల బాబు, అన్నెబోయిన సంపత్, అంగడి భాస్కర్, సింగారవేణి రాజు పాల్గొన్నారు.

తమ్మడపల్లిలో..

తమ్మడపల్లి (జి) గ్రామంలో ఇటీవల మృతి చెందిన సోన్నాయిల రవి, చేరిపల్లి కొమురయ్య కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అన్నం బ్రహ్మారెడ్డి అందించిన రూ.5 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని పార్టీ గ్రామ నాయకులు శనివారం అందజేశారు. రాపర్తి చంద్రయ్య, నక్క అజయ్, గుండెబోయిన సతీష్, పనికర ఎల్లయ్య, సంపత్ ఉన్నారు.

నర్మెటలో..

నర్మెట: మండల కేంద్రానికి చెందిన చిలుమోజు కరుణాకర్ మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు కరుణాకర్‌తో 1998–99 పదో తరగతి చదివిన స్నేహితులు రూ. 20వేల సాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు గుర్రాల కరుణాకర్, చిర్ర మహిపాల్‌రెడ్డి, నరేష్, రమేశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన గుర్రపు లక్ష్మి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. కాగా, మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శిం రూ.5వేల సాయం అందజేశారు. దశరథం, బుచ్చయ్య, చొక్కయ్య, పెద్దపురం, రమేష్, వెంకటయ్య, పాల్గొన్నారు.

నివాళి



మౌనం పాటిస్తున్న అడ్తి వ్యాపారులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ అడ్తిదారులు (వ్యాపారి) కందుకూరి రామాంజనేయులు ఇటీవల మృతి చెందగా, శనివారం సహచర వ్యాపారస్థులు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడితో వ్యాపారంలో కలిసి పని చేసిన రోజులను గుర్తుకు చేసుకున్నారు.

కాల్వలకు మరమ్మతులేవి?

- చెట్లు, మట్టితో కూరుకుపోయిన పరిస్థితి
- గండి పూడ్చివేతకు నోచుకోని బాలంతవాగు కాల్వ
- పట్టించుకోని పాలకులు, అధికారులు



జఫర్‌గఢ్‌లో గండి పూడ్చి వేతకు నోచుకోని బాలంతవాగు కాల్వ



చెట్లు, మట్టితో కూరుకుపోయిన కట్టు కాల్వ

జఫర్‌గఢ్: పూర్వం నిర్మించిన చెరువులు, కుంటలకు సంబంధించిన ప్రధాన కాల్వలు ఎన్నో ఏళ్ల నుంచి ఎలాంటి మరమ్మతులకు నోచుకోవడం లేదు. వీటిని మరమ్మతు చేయడంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వర్షకాలంలో నీరు నేరుగా చెరువులు, కుంటల్లోకి రాకుండా వృథాగా పోవడంతో పాటు కొన్నిచోట్ల కాల్వలు కోతకు గురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో మొత్తం 13 చెరువులు ఉండగా 83 కుంటలు ఉన్నాయి. వీటి పరిధిలో 950 హెక్టార్లకు పైగా పంట పొలాలు సాగుకావాల్సి ఉండగా కాల్వలు సాఫీగా లేకపోవడం వల్ల సాగు విస్తీర్ణం ప్రతి యేటా తగ్గుముఖం పడుతోంది. మండలంలోనే అతి పెద్ద చెరువైన జఫర్‌గఢ్ చెరువుకు మూడు ప్రధానమైన కాల్వలు ఉన్నాయి. కట్టుకాల్వ, మిద్దెకట్టు కాల్వతో పాటు బాలంతవాగు ఉంది. ఈ కాల్వల్లో పెద్ద పెద్ద చెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు మట్టితో కూరుకపోయాయి. ప్రధానంగా మిద్దెకట్టు కాల్వ అక్కడక్కడా ఆనవాళ్లు లేకుండా పోయింది. దీంతో వర్షపు నీరు నేరుగా చెరువులోకి రావడం లేదు. ప్రతి యేటా వర్షాలు కురిసినప్పుడల్లా బాలంతవాగు, కట్టుకాల్వ కోతకు గురి కావడం, రైతులు నష్టపోవడం పరిపాటిగా మారింది. కాల్వలు కోతకు గురైన ప్రతిసారి తాత్కలిక మరమ్మతు పనులు చేస్తున్నారే తప్ప శాశ్వత మరమ్మతులు చేపట్టడం లేదు. ఈ చెరువు కింద ఎక్కువగా చిన్న సన్నకారు రైతులకు సంబంధించిన పంట పొలాలు మాత్రమే ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల మూలంగా బాలంతవాగు కట్టుకాల్వ పెద్ద ఎత్తున కోతకు గురైంది. ఇప్పటి వరకు ఈ గండిని పూడ్చ లేదు. గతంలో కూడా హిమ్మత్‌నగర్ గ్రామం మీదుగా ఉన్న కట్టుకాల్వ సైతం కోతకు గురికావడంతో గ్రామస్తులు, సంబంధిత అధికారులు అప్పటికప్పుడు గండిని పూడ్చి వేశారు. కానీ బాలంతవాగు కాల్వ గండిని పూడ్చి వేయకపోవడంతో రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారే తప్ప వరద కాల్వల మరమ్మతు పనులు మాత్రం చేపట్టడం లేదు. గత ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు, కుంటలకు మరమ్మతు పనులు చేపట్టారే తప్ప వాటికి నీరందించే వరద కాల్వలను మాత్రం పట్టించుకోలేదు. ఈ వేసవిలోనైనా ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని చెరువులు, కుంటలకు సంబంధించిన వరద కాల్వల మరమ్మతు పనులు చేపట్టినట్లయితే వచ్చే వర్షకాలంలోనైనా వర్షపు నీరు వృథా కాకుండా నేరుగా చెరువులు, కుంటల్లోకి వెళ్లనుంది. దీనివల్ల కూలీలకు ఉపాధి లభించడంతో పాటు రైతులకు ఎంతో మేలు జరగనుంది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు వరద కాల్వల మరమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కట్టు కాల్వకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



జఫర్‌గఢ్ పెద్ద చెరువుకు సంబంధించిన కట్టు కాల్వకు శాశ్వత మరమ్మతులు చేయాలి. ఎన్నో ఏళ్ల నుంచి కాల్వ మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రతీ ఏటా భారీ వర్షాల వల్ల కాల్వ పలుమార్లు తెగిపోవడంతో రైతులు నష్టపోయారు. ఈ కాల్వ చెట్లు, మట్టితో కూరుకుపోయింది.

– మచ్చ హరీశ్, హిమ్మత్‌నగర్

బాలంతవాగు కాల్వ గండిని పూడ్చాలి



ఇటీవల కురిసిన భారీ వర్షం వల్ల బాలంతవాగు కాల్వ తెగిపోయి పెద్ద గండి పడింది. దీనివల్ల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఇప్పటి వరకు పలు మార్లు బాలంతవాగు కాల్వ తెగితే తాత్కలిక మరమ్మతులు చేపడుతున్నారే తప్ప శాశ్వత పనులు చేయడం లేదు. ఇప్పటికైనా గండిని పూడ్చివేయాలి.

– ఈరబత్తిని అంజయ్య, రైతు, జఫర్‌గఢ్

గోదావరి జలాలతో చెరువులు నింపండి

- సీపీఎం నాయకులు



ఎండుతున్న పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: పొలాలు ఎండుతున్నాయి.. గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపి రైతుల పంటలు కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కుర్చపల్లిలో ఎండిన వరి పొలాలను సీపీఎం నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రిజర్వాయర్ల ద్వారా చెరువులు, కుంటలు నింపడంలో పాలకులు, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందన్నారు. చెరువులు నింపక పోవడతంతో భూగర్భ జలాలు అడుగంటి పొట్ట దశలో ఉన్న వందల ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకొని సాగు నీరు విడుదల చేస్తే కొంత మేర నష్టాన్ని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాసాని పుల్లయ్య, కాసాని రాములు, గోపగోని వెంకటేశ్వర్లు, రవికుమార్, సోమల్లు, శివ, యాకలక్ష్మి, వైష్ణవి తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్ నుంచి నీళ్లు వదలాలి

దేవరుప్పుల: నవాబుపేట రిజర్వాయర్ నుంచి నీళ్లు వదిలి ఎండుతున్న పంట పొలాలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగార రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం దేవర్పుల మండలంలోని సీతారాంపురం గ్రామంలో పంట పొలాలను సీపీఎం నాయకులు పరిశీలించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

పాలకుర్తి: బాలల హక్కులను కాపాడాలని స్కోప్ ఎన్‌జీఓ సీఎస్‌ఎంలు నాద్ర తబస్సుమ్, తరుణ్, భరోసా సిబ్బంది రేష్మ, సునీత అన్నారు. శనివారం పాలకుర్తి జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బాలలకు సమస్యలు వస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. బాల్యవివాహాలు, బడి మానేసిన పిల్లలు, బాల కార్మికులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం శో భారాణి, లైజబీత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై డీపీఓకు ఫిర్యాదు

- విచారణకు డీఎల్‌పీఓను ఆదేశించిన డీపీఓ

స్టేషన్‌ఘన్‌పూర్: 2023 ఏప్రిల్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 6వ తేదీ వరకు మండలంలోని శివునిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన తిరునగరి శ్రీకాంత్ గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తూ రూ.30లక్షలకు పైగా అవినీతికి పాల్పడ్డాడని, తగిన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉమారాణి ఇటీవల జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టాలని డీఎల్‌పీఓను డీపీఓ ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లి గ్రామ కార్యదర్శిగా 2022 జనవరి నుంచి మార్చి 2023 వరకు కుర్ర చిరంజీవి కార్యదర్శిగా పనిచేసి మార్చిలో ఏసీబీకి పట్టుబడ్డాడు. అనంతరం ఏప్రిల్ 2023 నుంచి ఫిబ్రవరి 6,2025 వరకు శివునిపల్లి కార్యదర్శిగా శ్రీకాంత్ పనిచేశాడు. ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు మూడు గ్రామపంచాయతీలు కలిపి స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా ఏర్పడగా శ్రీకాంత్ ప్రస్తుతం మండలంలోని ఇప్పగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అయితే 2023 నుంచి 2025 ఫిబ్రవరి వరకు శివునిపల్లి కార్యదర్శిగా పనిచేసిన కార్యదర్శి పలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశాడని ఆరోపిస్తూ చిరంజీవి భార్య ఉమారాణి ఈనెల 21వ తేదీన డీపీఓ స్వరూపరాణికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుమేరకు తగిన విచారణ చేపట్టాలని డీఎల్‌పీఓను డీపీఓ ఆదేశించారు. కాగా, గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కార్యదర్శి శ్రీకాంత్ ఈనెల 5న ఉదయం 11 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయానికి పూర్తి ఆధారాలతో హాజరుకావాలని డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విచారణ అనంతరం జిల్లా కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, గతంలో ఏసీబీకి పట్టుబడిన చిరంజీవి తనపై ఉద్దేశ్యపూర్వకంగా, కక్ష్యపూరితంగా అతడి భార్యతో ఫిర్యాదు చేయించారని కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. శివునిపల్లిలో చిరంజీవిని ఏసీబీకి పట్టించిన కాంట్రాక్టర్‌కు తాను పనులు ఇవ్వడంతో కక్ష్యతో వ్యవహరిస్తున్నాడని వాపోయారు. గ్రామ అభివృద్ధి కోసం పనులు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి అధికారుల సూచనల మేరకు పనులు ఇచామని, అవినీతి ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని తెలిపారు.

అమరుల త్యాగాల ఫలితమే వర్గీకరణ



బచ్చన్నపేట: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

రఘునాథపల్లి/తరిగొప్పుల/జఫర్‌గఢ్/కొడకండ్ల/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/బచ్చన్నపేట/పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: మాదిగ అమర వీరుల త్యాగ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, మహాజన సోషలిస్టు పార్టీ, డక్కలిసంఘం నాయకులు అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక, సమానత్వపు పోరులో మాదిగల అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం అసువులు బాసిన మాదిగ అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పైస రాజశేఖర్, అల్వాల విజయ్‌కుమార్, రడపాక అదాం, జెరిపోతుల సుధాకర్, సుంచు సురేందర్, చింతల జైపాల్, చెరుపెల్లి యాదగిరి, దామెర ప్రభుదాస్, గుర్రం నవీన్, వెంకటేష్, రాగల్ల ఉపేందర్, గండి సురేశ్, గాదెపాక మహేందర్, కంతి చరణ్‌కుమార్, విక్రాంత్, విజయ్, సంపత్, సుదర్శనం, గంధమాల ఉదయ్, మేకల పరమేష్, మారపాక రఘు, దయాకర్, వంశీ, అఖిల్, ఇల్లందుల రాంబాబు, సోమశేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- డీఈఓఎం.రమేశ్

జనగామ రూరల్: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని డీఈఓ ఎం రమేశ్ అన్నారు. శనివారం జనగామ మండల ఎంఈఓ వంగాల రాజేందర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు.. రాజేందర్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి సంపత్ కుమార్, వివిధ సంఘాల నాయకులు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

బచ్చన్నపేట: మున్నూరు కాపు యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన బాషెట్టి అంకూస్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు గుజ్జుల రాజుపటేల్ శనివారం అకూస్ పటేల్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంకూస్ పటేల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి టౌన్: మామునూరు విమానాశ్రయం మంజూరు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 400 కోట్లు కేటాయించడంతో శనివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహేందర్, రవికుమార్, కమ్మగాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ముమ్మరంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఏపీఓ కుమారస్వామి

కొడకండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ముమ్మరంగా చేపట్టాలని ఏపీఓ నరిగే కుమారస్వామి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి 65 మంది కూలీలు లక్ష్యంగా మార్చిలోపు కేటాయించిన బడ్జెట్ ప్రకారం పనులు చేయాలన్నారు. డీఆర్‌డీఓ వసంత ఆదేశాలకనుగుణంగా గ్రామాల్లో ఉపాధి సిబ్బంది పనులు చేయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీఏ యాకయ్య, సుధీర్, సీఓలు రాజు, నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



జీపీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సురేష్‌నాయక్

కొడకండ్ల: ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. శనివారం నర్సింగాపురంలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ, రంగాపురంలో రూ.12 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టే అంగన్‌వాడీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలు వెనుకబడిన కొడకండ్ల మండల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. అనంతరం రంగాపురం క్రాస్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నందున వాటి నివారణ కోసం రోడ్డుపై పెయింటింగ్ వేయించినట్లు ఆయన తెలిపారు. యూత్ మండల అధ్యక్షుడు యాకేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాతకు బోనాలు



బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

బచ్చన్నపేట/నర్మెట: చిన్నరామన్‌చర్ల, నర్మెట మండల కేంద్రంలో దుర్గామాతకు గ్రామస్తులు శనివారం బోనాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద రాత్రి దుర్గామాత కథాపురాణాలను చెప్పి, అమ్మవారి కల్యాణం నిర్వహించారు. మహిళలు బోనాలతో రాత్రి అక్కడే ఉన్నారు. నేడు (ఆదివారం) గ్రామస్తులు వ్యవసాయ బావుల వద్దకు వన భోజనాలకు వెళ్లనున్నారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

గురువుకు సన్మానం



గురువును సత్కరిస్తున్న భరత్

రఘునాథపల్లి: విధి నిర్వహణలో భాగంగా మండలంలోని మండెలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లిన పంచాయతీ రాజ్ ఏఈఈ భాషిపాక భరత్ తన చిన్ననాటి గురువు విజయలక్ష్మి అనుకోకుండా ఎదురుపడింది. ఆమెను గుర్తు పట్టిన భరత్.. పాఠశాల రోజులు గుర్తుకు తెచ్చుకున్నాడు. దేవరుప్పుల మండలం కడవెండి ఉన్నత పాఠశాలలో భరత్ 6 నుంచి 10 తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన సమయంలో విజయలక్ష్మి గణితం పాఠాలు చెప్పేది. భరత్ ఉద్యోగం సాధించి ఎదురు పడటంతో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏఈఈ భరత్ గురువును శాలువాతో సన్మానం చేసి ధన్యవాదాలు తెలిపాడు. ఈ సందర్భంగా భరత్ విద్యార్థులతో మాట్లాడుతూ .. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని కన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఎమ్మెల్యే కడియం ఫ్లెక్సీకి జలాభిషేకం



కడియం ఫ్లెక్సీకి జలాభిషేకం చేస్తున్న మహిళలు

చిల్పూరు: శ్రీపతిపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫ్లెక్సీకి శనివారం జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఇబ్బందిని పరిష్కరించాలని మహిళలు ఇటీవల కాంగ్రెస్ నాయకులు కేశిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, రంగు రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. కాగా, ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు బోర్ వేయించడంతో పాటు మోటార్ బిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో పొలబోయిన నరేష్, కొయ్యడ రాందాసు, ఉడుత వేణు ఉన్నారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

జనగామ రూరల్: పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వివేకానంద సేవా సమితి ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్, పర్యావరణ ప్రముఖుడు శ్రీకాంత్ రుద్ర అన్నారు. జిల్లా కేంద్రంలోని గౌతమి మోడల్ స్కూల్‌లో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ బ్యాంగ్‌లకు బదులు జనపనార సంచులు మాత్రమే ఉపయోగించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, యాదగిరిరెడ్డి, ప్రిన్సిపాల్ పాషా పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



బచ్చన్నపేట: సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



పాలకుర్తి: బమ్మెర జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

చిల్పూరు/పాలకుర్తి/బచ్చన్నపేట/జఫర్‌గఢ్: పల్లగుట్ట, బమ్మెర, ఆలింపూర్, బచ్చన్నపేటలోని వాణి పాఠశాలల్లో విద్యార్థులు శనివారం స్వయం పరిపాలన దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చిల్పూరు: విద్యార్థులతో హెచ్‌ఎం నరసింహారెడ్డి



జఫర్‌గఢ్: తిమ్మంపేటలో..

పరీక్ష సామగ్రి పంపిణీ

పాలకుర్తి: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మహాత్మా గాంధీ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. ఎస్సై లింగారెడ్డి, ఎంఈఓ నర్సయ్య, ప్రత్యేకాధికారి నవీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాలకుర్తి : మండలంలోని తీగారం గ్రామానికి చెందిన పనికర రాజు శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన అత్తగారి ఇంట్లో తలెత్తిన భూ వివాదంలో ఆవేదన చెందిన రాజు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పాలకుర్తిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషయమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

చర్య తీసుకోవాలి

చిల్పూరు: కర్ణాలకుంటకు గండి పెట్టడమే కాకుండా అందులోని నాలుగు ఎకరాల భూమిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకుడు నారబోయిన కనుకరాజు కోరారు. ఈ మేరకు శనివారం సంఘం బాధ్యులతో కలిసి తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

కేసు నమోదు

బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు సిద్దిపేట జిల్లా చేర్యాల పోలీసులకు గంజాయి కేసులో శనివారం పట్టుబడ్డారు. మండల కేంద్రానికి చెందిన ఎనుగుల బాబు, బీడీ కాలనీకి చెందిన మహంకాళి రాజేష్‌లు గంజాయి తాగుతూ, విక్రయిస్తూ పట్టుబడగా చేర్యాల సీఐ శ్రీను కేసు నమోదు చేశారు. వీరితో పాటు చేర్యాలకు చెందిన నీలం చందు కూడా ఉన్నాడని, వీరి వద్ద 198 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు.

ఎన్నిక

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయ నూతన చైర్మన్‌గా గనగోని రమేశ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో శనివారం గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆలయ కమిటీని ఎన్నుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వారకల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం భక్తజన సందోహం మధ్య గోవింద నామస్మరణతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా స్వామి వారి వార కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు హైదరాబాద్‌కు చెందిన అరుణ్‌కెఉమార్-సీతామాలక్ష్మి, శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన నరేంద్రుల జగ్గయ్య-అరుణ దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.